వీరేశానికి చిన్నప్పటినుంచి ఒకటే పిచ్చి జనాభాను ఎలా తగ్గించాలా అని. చిన్నప్పుడు అమ్మ పెట్టే సగం అడ్డు తిని 'తమ్ముడు, చెల్లి లేకపోతే బాగుండేది కదా అన్నీ నాకే వచ్చేవి' అనుకునేవాడు. 'పోనీ తనే లేకుండా చెల్లాయి, తమ్ముడే వుండి వుంటే... అహ అలా కుదరదు. ఎందుకంటే ముందర పుట్టింది తనే కనుక, ఈ భూమ్మీద వుండే హక్కు తనకే' అనుకునేవాడు వీరేశం.

ఆరో తరగతిలోకి వచ్చాక తెలుగు మాస్టారు జనాభా సమస్యమీద వ్యాసం రాసి ప్రట్టమ్మంటే అపుడు తెలిసింది తనొక్కడికే కాదు మాస్టారికి, మిగతావాళ్ళకి కూడా అక్క, తమ్ముళ్ళ బాధ వున్నట్టు.

కొంచెం పెద్దయిన తరువాత అమెరికా వాళ్ళు జపాన్ వాళ్ళమీద బాంబు వేసినట్టు మనం కూడా బాంబులు వేస్తే ఎలా వుంటుంది అనుకునే వాడు. ఇలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు ఎవరికైనా చెబితే ముందర తనకే వాత పెట్టి చంపేస్తారని వీరేశానికి తెలుసు. కాని కొన్నాళ్ళ తర్వాత బాంబులు వేస్తే జనాలు టకెట్ తన్నేదిగాక పంట పొలాలు, ఇళ్ళు నాశనమవుతాయని సోషల్ మాస్టారు చూచాయగా చెప్పాడు వీరేశానికి. అపుడు భయ మేసింది వీరేశానికి. ఎందుకంటే దమ్మలగూడెంలో వుండే రెండెకరాలు తనకే ఇస్తాననేది బామ్మ, కొట్టు నుంచి ముక్కుపొడుం తెచ్చినప్పుడల్లా. అమ్మ బాబోయ్, అది పోతే ఎలా? బామ్మ చెల్లాయితో పేలు చూపించుకున్నప్పుడల్లా అదే రెండెకరాలని లంచం పెట్టేదని వీరేశానికి ఏడేళ్ళ తర్వాత వాళ్ళ బామ్మ చనిపోయినప్పుడు కాని తెలియలేదు.

క్రైమ్ మూవీస్ చూసినపుడల్లా స్టెన్ గన్‌లు తీసుకుని అలాగే ఊళ్ళోకెళ్ళి టపటపా జనాల్ని చంపెయ్యాలని వీరేశానికి వుండేది. ఆ మాటే వాళ్ళ నాన్నతో అంటే నూతి దగ్గర చేంతాడు చేతతీసుకుని వీరేశం తోలు వలిచేయడానికి వీథి చివరిదాకా వెంట పడ్డాడు వాళ్ళ నాన్న.

ఆ తరువాత ఎవరి దగ్గరా వాగేవాడు కాదు. ఒకవేళ అలాంటి వెధవాలోచనలు వచ్చినా కూడా మనసులోనే అనుకునేవాడు కాని బయటకు మాటొస్తే ఒట్టు.

కొంచెం పెద్దయిన తరువాత ఊరు బయట బడ్డీ కొట్టు దగ్గర ఆడపిల్లల గురించి మాట్లాడడం నేర్చుకున్న తరువాత, పెళ్ళి గురించి కలలు కనడం నేర్చిన తరువాత ఏమైనా సరే తనకు మటుకు ఇద్దరికంటే ఒక్క పురుగు ఎక్కువ వుండడానికి వీల్లేదని భార్యతో పెళ్ళయిన తరువాత చెప్పాల్సిన విషయాలలో ఇదొకటి అనుకునేవాడు.

ఇలా అలా ఆలోచనలతోనే ఆ డిగ్రీ పూర్తిచేసి ఓ బట్టల కొట్టులో ఉద్యోగం సంపాదించాడు. వెంటనే వీరేశానికి పెళ్ళి సంబంధాలు కుప్పలు తెప్పలుగా వచ్చిపడ్డాయి. చివరికి భూదేవిని, ఆరువేల కట్నం, మూడు సవర్ల బంగారం ఇస్తానని వాళ్ళ నాన్న వీరేశానికి అంటగట్టాడు. వీరేశం మటుకు గిల్టు ఉంగరం, నాలుగు వేల కేష్ తప్ప చిల్లు కానీ కూడా కళ్ళమాడలేదు. ఇదిలా వుండగా భూదేవి పెళ్ళయిన రెండు నెలలకల్లా నూతి గట్టంతా చెడగొట్టేయడం ప్రారంభించింది వాంతులతో. ఇది వినగానే వీరేశం అమ్మో ఇంత తొందరగానా అని సొమ్మసిల్లి ధమ్మని పడ్డాడు నేలమీద. భూదేవి నీళ్ళు చల్లిన తరువాత లేచి, పోనీలే అని సముదాయించుకుని 'ఎప్పుడైతే ఏం పోయింది, ఇద్దరి తరువాత ఎలాగూ ఆపరేషన్ చేయించుకోవాలి గదా' అని భూదేవి చేసిన పాయసం తాగి కొట్టుకు బయలుదేరాడు.

మొదటిసారి ఆడపిల్ల పుట్టింది. 'సరి సరి, రెండోసారి మగపిల్లవాడు. తరువాత స్టాప్!' అనుకున్నాడు. భూదేవి పెళ్ళయిన రెండేళ్ళకే రెండోసారి వాంతులు చేసుకుంటోంది. అనుకున్నదే గదా అనుకుని ఊరుకున్నాడు వీరేశం. ఈసారీ ఆడపిల్లే పుట్టింది భూదేవికి. దెబ్బకి వీరేశానికి కడుపులో గడబిడ అయిపోయి చెమటలు పట్టాయి. ఏం చేయాలో తెలియక కంగారుపడిపోయాడు. ఆ దెబ్బతో భూదేవికి ఆపరేషన్ చేయించుదామనుకున్నాడు.

రెండోసారి కూడా ఆడపిల్లే అయ్యేటప్పటికి భూదేవికి కొంచెం బాధేసింది. ఎంతో కాదులెండి ఆవగింజలో ఆరో వంతు. పోనీలే 'మళ్ళీసారి తప్పకుండా మగపిల్లాడే!' అని మనసు స్వాధీనంలోకి తెచ్చుకుంది. 'మళ్ళీసారి' అనే మాట విని వీరేశానికి గుండె లవిసిపోయాయి. దెబ్బతో భూదేవిని కూర్చోబెట్టి ఓ రోజంతా క్లాసు తీశాడు; చిన్నప్పటినుంచి తన ఆలోచనలు, ఆవేశాలు, పిల్లలు ఎక్కువయితే తన ఒక్కడి జీతంతో భరించలేమనే విషయాన్ని విపులంగా వివరించి సర్ది సర్ది చెప్పాడు. కాని భూదేవి వింటేనా! ఖచ్చితంగా చెప్పేసింది. పుట్టింటివేపు కూడా ఎవరూ మగపిల్లలు లేనందువల్ల తండ్రికి (వాళ్ళ నాన్నకి) మగపిల్లలు ఇష్టం అవడం మూలాన "అంతగా భరించలేకపోతే మా నాన్నే చూసుకుంటాడు" అని వీరేశానికి చెప్పేసింది. పైగా "మగపిల్లలు లేకపోతే వంశ ఉద్ధరణ ఎలా?" అంటూ గట్టిగా లెక్చరిచ్చింది. రెండు సోడాలు తాగితే గాని వీరేశం తెరిపిన పడలేదు. భూదేవి మాట వినక తప్పలేదు వీరేశానికి. ఆర్నెల్లలో వారు వీరవుతారన్నట్టు వీరేశం మగపిల్లాడు కావాలని అనుకుంటున్నాడు ఇపుడు. ఏడేళ్ళ తరువాత చూస్తే గుమాస్తా వీరేశానికి నలుగురూ ఆడపిల్లలే. ఇంకా భూదేవి మగపిల్లాడి కోసం ప్రయత్నిస్తూనే వుంది. అప్పుడర్థమయింది వీరేశానికి దేశంలో జనాభా సమస్య ఎందుకు ఎక్కువగా వుంటుందో!

—రజని కాకర్ల




### పేదరికం

ఆగర్భ శ్రీమంతుడైన సార్వభౌమారావు కొడుకు నాని. నాని ఒకరోజు స్కూల్లో టీచర్ 'పేదరికం' మీద వ్యాసం వ్రాయమని హోమ్ వర్క్ ఇచ్చింది. నాని ఇలా వ్రాశాడు.

"అనగా అనగా ఒక పేద కుటుంబం వుండేది. ఆ కుటుంబంలో అమ్మా, నాన్న, పిల్లలు, పని మనిషి, తోటమాలి, డ్రైవర్ అంతా పేదవారే. ఆ కుటుంబంలో ప్రతి ఒక్కళ్ళు పేదవారే."